
టాప్ న్యూస్

## నిన్ను చంపుతాం



- ఎంపీ రఘునందన్ రావుకు మళ్లీ బెదిరింపు
- మావోల పేరుతో మూడోసారి బెదిరింపు కాల్స్ చేసిన వైనం

02

## ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్



- ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం
- 7 గంటల పాటు విచారణ.. అనంతరం అదుపులోకి
- రూ. 3,200 కోట్ల స్కామ్.. ఏ4గా ఎంపీ మిథున్ రెడ్డి

02

## రాజగోపాల్ రెడ్డి వన్నీ బ్లాక్ మెయిల్ స్టేట్‌మెంట్లే...



- ఒక మాట అని వెంటనే కాంప్రమైజ్ అవుతారు
- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్

02


ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER: APTEL/2014/58382

20-07-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 227 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD

ఆదివారం

WWW.EPAPER.MAHAADAILY.COM





## భారత్-పాక్ యుద్ధం నేనే ఆపా

### ట్రేడ్ డీల్‌తోనే ఆగిందన్న ట్రంప్

**మహా:** భారత్ పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి గొప్పలు చెప్పుకున్నారు. వాణిజ్య ఒప్పందంతో ఇరుదేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతను ఆపినట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు ఇవే వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ యుద్ధ విరమణ విషయంలో స్పష్టత వచ్చాక కూడా అదే వ్యాఖ్యలు మళ్లీ చేస్తున్నారు. 'మేం చాలా యుద్ధాలను ఆపాం. అవి చిన్నవేం కావు. ఇండియా పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణ కూడా చాలా తీవ్రమైంది. ఆ సమయంలో విమానాలను కూల్చివేశారు.

మిగతా 4లో



# బీ కేర్ ఫుల్ నా కొడకా

## గర్జించిన ఈటల

### నువ్వేవడివి అసలు .. నా చరిత్ర నీకు తక్కువ తెలుసు

- నేను ఎప్పుడైన స్ట్రెయిట్ ఫైట్ చేస్తా నీలాగా స్ట్రీట్ ఫైట్ చేయను
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో.. నా అడుగుపడని ఊరు లేదు
- హుజూరాబాద్ వస్తా.. స్థానిక ఎన్నికల్లో మీరే బరిలో ఉంటారు
- నాపై కురచ స్వభావంతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు
- వారి సంగతి.. బీజేపీ హైకమాండ్ చెబుతా.. నిర్ణయం తీసుకోకుంటే నష్టం నాకు కాదు
- శామీర్ పేట లో కేంద్రమంత్రి బండి టార్గెట్ గా ఫుల్ ఫైర్

**హైదరాబాద్, మహా:** బీకేర్ ఫుల్ నా కొడకా.. నా జోలికొస్తే ఖబడ్దార్. నా జోలికి రావద్దు. పిచ్చి వేషాలు వేస్తే నష్టం ఎవరికో మీకు తెలుస్తుంది. నేను ఎప్పుడైన స్ట్రెయిట్ ఫైట్ చేస్తా నీలాగా స్ట్రీట్ ఫైట్ చేయను అంటూ మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ పరోక్షంగా కేంద్రమంత్రి బండి సంజయ్ పై తీవ్ర విమర్శలు చేశారు. ఈటల వర్గానికి స్థానిక ఎన్నికల్లో టికెట్లు ఇవ్వనంటూ బండి సంజయ్ పరోక్ష సంకేతాలిచ్చారని ఆందోళన చెందుతూ హుజూరాబాద్ నుండి పెద్ద ఎత్తున బిజెపి కార్యకర్తలు ఎంపీ ఈటల రాజేందర్ ఇంటి ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ కేంద్రమంత్రి బండి సంజయ్ టార్గెట్ పై ఓ రేంజ్ లో ఫైరయ్యారు. నువ్వేవడివి అసలు .. నా చరిత్ర నీకు తక్కువ తెలుసు. నేను ఎప్పుడైన స్ట్రెయిట్ ఫైట్ చేస్తా నీలాగా స్ట్రీట్ ఫైట్ చేయను.


మిగతా 2లో



# కులగణన మెగా హెల్త్ చెకప్

### దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ మారుతోంది

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు: సీఎం రేవంత్
- కుల గణనపై 300 పేజీలతో ప్రభుత్వానికి నివేదిక
- 50 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహణ
- కుల గణన సర్వే చరిత్రాత్మకమైందని అభిప్రాయపడ్డ కమిటీ
- డేటా సేకరించిన పద్ధతి శాస్త్రీయంగా, నిశితంగా ఉందని వెల్లడి



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ ప్రభుత్వానికి తమ నివేదికను సమర్పించింది. ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే పూర్తి శాస్త్రీయంగా, విశ్వసనీయంగా ఉందని నిపుణుల కమిటీ తన నివేదికలో అభిప్రాయపడింది. తెలంగాణలో పూర్తి చేసిన ఈ సర్వే చారిత్రాత్మకమని, దేశానికి రోల్ మాడల్‌గా నిలుస్తుందని కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలోని నిపుణుల కమిటీ సభ్యులు 300 పేజీల నివేదికను సమర్పించారు. నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలు, సూచనలను మంత్రిమండలి సమావేశంలో చర్చించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించింది.

**50 రోజుల పాటు రాష్ట్ర సర్వే..**

రాష్ట్రంలో బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు ఈ నివేదిక ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు, అందుకు కారణాలపై నిపుణుల కమిటీ అధ్యయనం చేయాలని కోరారు

మిగతా 2లో

### బట్టలిప్పి నడిరోడ్డు మీద

# నిలబెడతా..

### కేటీఆర్‌పై మైనంపల్లి తీవ్ర వ్యాఖ్యలు

### గతంలో షాడో సీఎంగా వ్యవహరించారు



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ జీవితంలో ముఖ్యమంత్రి కాలేడన్నారు. గతంలో కేటీఆర్ షాడో సీఎంగా వ్యవహరించారని, సిరిసిల్ల ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పే రోజులు వస్తాయన్నారు. శనివారం గాంధీభవన్ లో మైనంపల్లి మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మైనంపల్లి మండిపడ్డారు.

మిగతా 2లో

## హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణ స్వీకారం



- ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు, న్యాయవాదులు

02



## ఏ ఒక్క రైతు ఇబ్బంది పడొద్దు!


- వానాకాలం పంటలకు సమృద్ధిగా నీరివ్వాలి
- నీటి విడుదలపై రూట్ మ్యాప్ రూపొందించి అమలు చేయండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- ఖరీఫ్ పంటకు నీటి విడుదల వంటి అంశాలపై మంత్రి రివ్యూ

03

# టాలీవుడ్‌లో రివ్యూ మాఫియా

### పైసా ఇస్తేనే స్టార్లు.. లేకుంటే నెగిటివ్ కామెంట్స్

### పూలచొక్కాపై కేసుతో గుట్టు బయటకు



**హైదరాబాద్, మహా:** తెలుగు సినిమాను రివ్యూ మాఫియా శాసిస్తోందా..అంటే అవుననే సమాధానం వస్తోంది. కొందరు నిర్మాతల నుంచి మంచి రేటింగ్ ఇవ్వాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. లేటెస్ట్‌గా 'వర్జిన్ బాయ్స్ నిర్మాత.. రివ్యూలిచ్చే యూట్యూబర్ పూలచొక్కా నవీన్‌పై కేసు పెట్టాడు. పాజిటివ్ రివ్యూ ఇచ్చేందుకు నవీన్ తనను డబ్బులు డిమాండ్ డబ్బులు చేశాడంటూ నిర్మాత కేసు ఫైల్ చేశాడు. వర్జిన్ బాయ్స్ సినిమా ప్రమోషన్ కోసం నవీన్‌తో చిత్ర యూనిట్ ఓ డీల్ కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం సినిమా రిలీజ్‌కు ముందు సినిమాను తన యూట్యూబ్ చానల్ ద్వారా ప్రమోట్ చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రమోషన్ సమయంలో నవీన్ మొదట మంచి రివ్యూలు ఇచ్చినప్పటికీ, తర్వాత చిత్రానికి నష్టం

మిగతా 3లో

## పార్లమెంటులో అమీతుమీ

### .. ఇండియా కూటమి వర్చువల్ మీట్

03



### వచ్చే ఏడాది నుంచే

## కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి

- ఇది దేశంలోనే పెద్ద రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్
- వందేభారత్ బోగీలు కూడా ఇక్కడే తయారవుతాయి
- కాజీపేట నుంచి త్వరలోనే 150 లోకోమోటివ్‌లు కూడా ఎగుమతి: అశ్వినీ వైష్ణవ్
- 40 ఏళ్ల ఓరుగల్లు వాసుల కలను సాకారం చేశాం: కిషన్ రెడ్డి
- రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పరిశీలించిన కేంద్ర మంత్రులు

వివరాలు 3లో



# బీ కేర్ ఫుల్ నా కొడకా

## గర్జించిన ఈటల

### నువ్వేవడివి అసలు .. నా చరిత్ర నీకు తక్కువ తెలుసు

- నేను ఎప్పుడైన స్ట్రెయిట్ ఫైట్ చేస్తా నీలాగా స్ట్రీట్ ఫైట్ చేయను
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో.. నా అడుగుపడని ఊరు లేదు
- హుజూరాబాద్ వస్తా.. స్థానిక ఎన్నికల్లో మీరే బరిలో ఉంటరు
- నాపై కురచ స్వభావంతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు
- వారి సంగతి.. బీజేపీ హైకమాండ్ చెబుతా.. నిర్ణయం తీసుకోకుంటే నష్టం నాకు కాదు
- శామీర్ పేట లో కేంద్రమంత్రి బండి టార్గెట్ గా ఫుల్ ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

నేను శత్రువుతో కోట్లాడుతా.. నీలాగా కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించుకోను. ఎంతో మంది సీఎంలతో కొట్లాడిన, నీ లాంటి వాడితో కొట్లాడితే నా పతార ఏం కావాలి. హుజురాబాద్‌లో ఎమ్మెల్యేకి ఎన్ని ఓట్లు వచ్చాయో ఎంపీకి కూడా అన్ని ఓట్లు వేయించా . రేపు నా మనుషులే ఎన్నికల్లో సర్పంచ్‌గా, వార్డ్ మెంబర్‌గా ఉంటారు. మీ బ్రతుకు ఏందో అందరికీ తెలుసు. చిన్న కురుస మనుషులు. నీడను చూసి భయపడేవారు. ధీరుడుతో కోట్లాడతాం.. కుట్రదారులతో కాదు. మీరు ఎవరు, మీ శక్తి ఏంది.. మా శక్తి ఏంది. 2002లో కరీంనగర్ కి వచ్చినా.. నా అడుగు పడని ఊరు లేదు. 2 సార్లు ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన. రెండుసార్లు మంత్రిగ చేసిన. నా కార్యకర్తలను గుర్తించి టికెట్ ఇస్తే సరే.. లేదంటే వార్డు మెంబర్ నుండి సర్పంచ్, ఎంపీటీసీ నుండి ఎంపీపీ వరకు, జడ్పీటీసీ నుండి జెడ్పీ చైర్మన్ వరకు అన్నీ ప్రజల ఆశీర్వదించి గెలిపిస్తారు అనే నమ్మకం ఉంది. పిచ్చి వేషాలు వేస్తే నష్టం ఎవరికో మీకు తెలుస్తుంది. నా జోలికి రావద్దు, నాకు అడ్డు రావద్దు అంటూ ఈటెల రాజేందర్ ఫుల్ వార్నింగ్ ఇచ్చారు.

## హుజూరాబాద్ వస్తా.. మీ వెంటే ఉంటా

హుజురాబాద్ వస్తా.. మీ వెంటే ఉంటా.. మిమ్మల్ని గెలిపించుకుంటా.పదిరోజులకు ఒకసారి హుజురాబాద్ వస్తా .నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో ఆఫీస్ ఉంటుంది. కార్యకర్తలు మరుగుజ్జులు కాదు.. కుంగిపోవద్దని ఈటల రాజేందర్ సూచించారు. సముద్రంలో తుఫాన్ వచ్చే ముందు సైలెంట్‌గా ఉంటదని చెప్పకొచ్చారు. తన లాంటి వాళ్లు మాట్లాడితే సమాజం రియాక్ట్ అవుతుందని.. తాను ప్రజల నుంచి వచ్చిన వాడినని, ప్రజలే తనకు న్యాయ నిర్ణేతలని ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

## శత్రువుతో కొట్లాడొచ్చు

శత్రువుతో కొట్లాడొచ్చు కానీ కడుపులో కత్తులు పెట్టుకొనే వారితో పోరాటం చేయలేమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సంచలన కామెంట్స్ చేశారు. ఇటీవల కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపట్ల రాజేందర్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. హుజురాబాద్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆ ప్రాంతానికి చెందిన కార్యకర్తలు శామీర్‌పేట్‌లోని ఈటెల రాజేందర్ ఇంటికి భారీగా తరలివచ్చారు. హుజురాబాద్ తెలంగాణ ప్రతీకకు అడ్డా అని, ఇక నుంచి అక్కడ స్ట్రైట్ ఫైట్ ఉంటుందని.. స్ట్రీట్ ఫైట్ ఉండదని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. మీదికి ఒక మాట.. లోపల ఒక మాట మాట్లాడటం తనకు రాదన్నారు. బాజాప్తా మాట్లాడతా.. బేజాప్తా మాట్లాడటం రాదన్నారు. రాజకీయాల్లో అవమానాలు , అవహేలనలను దాటి ముందుకు వెళ్లాలని చెప్పుకొచ్చారు. మనకు మనంగా బీఆర్ఎస్ నుంచి బయటకు రాలేదు. అప్పుడు కేసీఆర్ తన విషయంలో చేసింది అదేనని గుర్తుచేశారు. హుజురాబాద్ లో ఓడిపోతా అని ఊహించలేదు. అయినా హుజురాబాద్ బిడ్డలు తనను కాపాడుకున్నారని నొక్కిచెప్పారు. తాను అలాగే వారిని కాపాడుకుంటానని మాటిచ్చారు. వ్యక్తులు ఎదగకుండా పార్టీ బలపడలేదు. కార్యకర్తల ఆవేదన అర్థం అయ్యింది. కార్యకర్తలకు రాజకీయ అవసరాలు తీర్చలేనంత నిస్సహాయంగా లేను. నా అనుభవం వాడుకుంటే పార్టీకి ఉపయోగపడుతుంది. పదవులే పరవధిగా భావించే వాడిని కాదు. ఏ పార్టీలో పనిచేస్తే ఆ పార్టీకి అంకితభావంతో పనిచేశానన్నారు. బీసీ బిడ్డగా తాను మంత్రి పదవులు చేశానని గుర్తుచేశారు. దేశ ప్రధాని వ్యక్తుల కోసం కాకుండా వ్యవస్థ నిర్మాణం కోసం పని చేస్తున్నారని చెప్పారు. మనమంతా దేశ ధర్మం కోసం కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో కొంతమంది ఉంటారని.. ఇతరులను ఎదగనివ్వకుండా చేయడమే వాళ్ల పని విమర్శించారు . కురుస స్వభావులు.. మిమ్మల్ని చూసి నవ్వాలో, ఏడవాలో తెలియడం లేదన్నారు



# కులగణన మెగా హెల్త్ చెకప్

## దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ మారుతోంది

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు: సీఎం రేవంత్
- కుల గణనపై 300 పేజీలతో ప్రభుత్వానికి నివేదిక
- 50 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహణ
- కుల గణన సర్వే చరిత్రాత్మకమైందని అభిప్రాయపడ్డ కమిటీ
- డేటా సేకరించిన పద్ధతి శాస్త్రీయంగా, నిశితంగా ఉందని వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటామని, ప్రజల అవసరాలను గుర్తించి సరైన సూచనలు ఇవ్వాలని కమిటీని కోరారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అల్లూరి లక్ష్మణ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను నిర్వహించింది. మొదటి దశలో 2024 నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు 50 రోజుల పాటు రాష్ట్రమంతటా సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం జనాభాకు చెందిన సమాచారం సేకరించేందుకు ప్రతి జిల్లాలో ప్రతి 150 కుటుంబాలను ఒక బ్లాకుగా ఎంచుకుంది. ఒక్కో బ్లాక్‌కు ఒక ఎన్యుమరేటర్‌ను, ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్ వైజర్‌ను నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లతో శాస్త్రీయ విధానంలో సర్వే చేయించింది.

**బలహీన వర్గాల వర్గాల అభ్యున్నతి..**

మొదటి విడతలో రాష్ట్రంలో 96.9 శాతం కుటుంబాలను సర్వే చేసి ఆయా కుటుంబాల వివరాలను 36 రోజుల్లో డేటాను ప్రత్యేకంగా ఎంట్రీ చేయించింది. మొదటి దశలో హౌస్ లిస్టింగ్ చేసిన కుటుంబాలు కొన్ని వేర్వేరు కారణాలతో సర్వేలో తమ వివరాలు నమోదు చేయకపోవటంతో ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు రెండో విడతలో వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. మీ సేవా కేంద్రాలు, జీహెచ్ఎంసీ, ఎంపీడీవో ఆఫీసులు, వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలకు నమోదు చేసుకునే వీలు కల్పించింది. ఈ సర్వే ఫలితాల ప్రకారం రాష్ట్రంలో 1,15,71,457 గృహాలు ఉన్నాయి. 1,12,36,849 (97.10 శాతం) కుటుంబాల నుంచి 3,55,50,759 మంది ఈ సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకున్నారు. ఫలితాల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీలు 61,91,294 (17.42 శాతం), ఎస్టీలు 37,08,408 (10.43 శాతం), బీసీలు 2,00,37,668 (56.36 శాతం), ఇతర కులాలకు చెందిన వారు 56,13,389 (15.89 శాతం) ఉన్నట్టు తేలింది. సర్వే ఫలితాలను విశ్లేషించి వివరణాత్మక నివేదికను అప్పగించే బాధ్యతను ఈ నిపుణుల కమిటీకి అప్పగించింది. వివిధ దఫాలుగా సమావేశాలు జరిపిన కమిటీ డేటాను సేకరించిన పద్ధతి శాస్త్రీయంగా నిశితంగా ఉందని గుర్తించింది. ప్రభుత్వ విధానాల రూపకల్పనతో పాటు ఇప్పుడు అమల్లో ఉన్న విధానాలను మెరుగుపరిచేందుకు, సామాజిక న్యాయం, సాధికారత, వెనుకబడిన బలహీనవర్గాల వర్గాల అభ్యున్నతిని మెరుగుపరిచేందుకు సర్వే సహాయపడుతుందని కమిటీ సూచించింది.

# బట్టలిప్పి నడిరోడ్డు మీద నిలబెడతా..

## కేటీఆర్‌పై మైనంపల్లి తీవ్ర వ్యాఖ్యలు

### గతంలో షాడో సీఎంగా వ్యవహరించారు

(మొదటిపేజీ తరువాయి)

నరం లేని నాలుక మాదిరి కేటీఆర్ అహంకారపూరిత మాటలున్నాయన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల ఆరాచక పాలనపై ఓ బుక్ రాసి గడప గడపకు పంచుతానని తెలిపారు. కేటీఆర్ జైలు ఊసలు లెక్కపెట్టడం ఖాయమని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఏపీ, తెలంగాణ మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు.

**అవసరమైతే దాడులు చేస్తాం**

ఇంటికి ఇంటికి ఉద్యోగం,దళిత సీఎం, దళితులకు భూములు ఇస్తామని మోసపూరిత హామీలు ఇచ్చారని, డబుల్ బెడ్ రూం అంటూ కాలయాపన చేశారని మండిపడ్డారు. సీఎం రేవంత్ పెద్ద మనసుతో డబుల్ బెడ్ రూమ్ కట్టిన వాళ్ల కోసం రూ.9 వేల కోట్లు నిధులు కేటాయించాటారని తెలిపారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని విష ప్రచారం చేయడమే కేటీఆర్ పని



మైనంపల్లి ఆరోపించారు. ఎక్కువ మాట్లాడితే బావ ,బామ్మర్ధుల బట్టలు విప్పి నడిరోడ్డు మీద నిలబెడతానని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం దేనికైనా సిద్ధం గుర్తుపెట్టుకోవాలన్నారు. కేటీఆర్, హరీష్ రావు అవసరమైతే మీ ఇళ్లపై దాడులు చేస్తామని తెలిపారు.

# సీఎంను తిడితే రక్తం ఉడుకుతోంది


- నీ మంచికే చెబుతున్నా రేవంత్‌ను రెచ్చగొట్టకు
- ఎస్కార్ట్ పక్కనపెట్టి బయటకొస్తే తట్టుకుంటవా?
- మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** కేసీఆర్ పాలన 'ఆహా నా పెళ్ళంట' సినిమాలో కోట శ్రీనివాస్ తిన్న కోడి లాగా ఉండేది. చదువు అంటే భవిష్యత్తు కాబట్టే మా ప్రభుత్వం పిల్లల చదువుపై ఖర్చు చేస్తున్నాం. కేటీఆర్ ను చూస్తే జాలిగా ఉంది.' అని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డిని తిడితే తన రక్తం ఉడుకుతోందని అన్నారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో జగ్గారెడ్డి బీఆర్ఎస్ పైనా, కేటీఆర్ మీదా హాట్ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పాలనపై సిద్ధిపేట, సిరిసిల్లా, గజ్వేల్‌లో మీటింగ్ పెట్టేందుకు సిద్ధమానన్న ఆయన.. కేటీఆర్ ను సవాల్ చేశారు. చర్చకు మీ ఫ్యామిలీ రెడీ అయితే, మా కాంగ్రెస్ ఫ్యామిలీ రెడీ అంటూ ఛాలెంజ్ చేశారు. మీటింగ్ ఖర్చు రేవంత్ రెడ్డి భరిస్తారని చెప్పారు. 'సీఎం రేవంత్ రెడ్డిని నేను ఒప్పిస్తాను. బీఆర్ఎస్ నేతలు చర్చకు వస్తారా? ఏ శాఖపై చర్చ చేద్దామో చెప్తే ఆ మంత్రిని చర్చకు ఒప్పిస్తాను. ఎమ్మెల్యే అయ్యాక కూడా నేను దొడ్డు బియ్యమే తిన్నాను. బీఆర్ఎస్ నాయకులను శరీరమంతా భూమిలో పాతి పెట్టి పాములు వదిలే పనిష్మెంట్ ఇవ్వాలని జగ్గారెడ్డి అన్నారు. 'ఏం తప్పు చేశామని సీఎం రేవంత్ ను, కాంగ్రెస్ పార్టీని తిడుతున్నారు? ఉచిత బస్సు వల్ల మహిళలకు ఉపయోగం జరిగిందా లేదా అని సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గంలో అడుగుదామా?' అంటూ జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు.

# రాజగోపాల్ రెడ్డి వన్నీ బ్లాక్ మెయిల్ స్టేట్ మెంట్లే

## ఒక మాట అని వెంటనే కాంప్రమైజ్ అవుతారు.. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** రాజగోపాల్ రెడ్డి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వాళ్లవి అన్ని బ్లాక్ మెయిల్ స్టేట్ మెంట్లే ఉంటాయని బిఆర్ఎస్ నేత, మాజీమంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆయన సోదరుడు రాజగోపాల్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శలు గుప్పించారు. వెంకట్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఒక మాట అని వెంటనే కాంప్రమైజ్ అవుతారని అన్నారు. రేవంత్ రెడ్డి పీసీసీ పదవిని కొనుక్కున్నారని వాళ్లిద్దరే అన్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేయను అని రాజగోపాల్ రెడ్డి వెళ్లిపోయాడని మళ్లీ అదే పార్టీలోకి వెళ్లాడని విమర్శించారు. పెద్ద మొనగాళ్లం అని చెప్పుకుంటారని రాజగోపాల్ రెడ్డి మాటలన్నీ ఉత్తవే అని నమ్మితే అమాయకత్వమే అని అన్నారు. రాజగోపాల్ రెడ్డి మాటలు నమ్మితే వాళ్లు అమాయకులే అని ఎద్దేవా చేశారు. రాజగోపాల్ రెడ్డికి అంత దమ్మే ఉంటే ఆయనతో పార్టీలో నుండి బయటకు వచ్చే నేతలను కూడగట్టాలని అన్నారు. రేవంత్ రెడ్డి మాటలను ఖండించేవాళ్లు ఎంతమందో తనతో కలిసి రావాలని చెప్పాలన్నారు. కానీ వాళ్ల వెంట ఎవరూ రారని, ఎందుకంటే వాళ్లే మాటపై నిలబడరని ఎద్దేవా చేశారు.




# నిన్ను చంపుతాం

## ఎంపీ రఘునందన్ రావుకు మళ్లీ బెదిరింపు

### మావోల పేరుతో మూడోసారిబెదిరింపు కాల్స్ చేసిన వైనం

**హైదరాబాద్, మహా:** మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి బెదిరింపు కాల్ రావడం కలకలం రేపుతోంది. మావోయిస్టుల పేరుతో బెదిరింపు కాల్ చేసిన ఆగంతకులు అంతు చూస్తామంటూ బెదిరించారు. ఇప్పటికే రఘునందరావుకు రెండుసార్లు బెదిరింపు కాల్స్ వచ్చిన సంగతి తెలిసిందే. మావోయిస్టుల పేరుతో 7297965748 నంబర్‌తో ఫోన్ కాల్ వచ్చింది. 'మరి కాసేపట్లో నిన్ను లేపేస్తాం. ఆపరేషన్ కగార్ ఆపండి. లేదంటే నీ ప్రాణాలు తీస్తాం. ఇప్పటికే మా టీంలు హైదరాబాద్‌లో ఉన్నాయి. దమ్ముంటే కాపాడుకో' అంటూ గతంలో కూడా అగంతకులు రెండు నెంబర్ల నుంచి రఘనందన్ బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. శనివారం సాయంత్రంలోగా నిన్ను చంపుతామంటూ.. మావోయిస్టు పేరుతో మధ్యప్రదేశ్ నుంచి మరో ఫోన్ కాల్ మరో ఫోన్ కాల్ వచ్చింది.. గత నెలలో రోజుల వ్యవధిలో రెండుసార్లు ఫోన్ కాల్స్ వచ్చాయి. తాజాగా మూడోసారి బెదిరింపు కాల్ వచ్చింది.





# హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు, న్యాయవాదులు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. గతంలో ఆయన త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఈ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నూతన సీజేగా ప్రమాణం చేసిన ఏకే సింగ్‌కు అభినందనలు తెలియజేశారు. కాగా ఇటీవల దేశంలో ఐదుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేస్తూ, ఐదు హైకోర్టులకు కొత్త సీజేలను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణతో పాటు త్రిపుర, మద్రాస్, రాజస్థాన్ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులు బదిలీ అవ్వగా.. మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, కర్ణాటక, గువాహటి, పట్నా హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులు నియమితులయ్యారు.

# ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్

## ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం

### 7 గంటల పాటు విచారణ.. అనంతరం అదుపులోకి

### రూ. 3,200 కోట్ల స్కామ్.. ఏ4గా ఎంపీ మిథున్ రెడ్డి

**విజయవాడ, మహా:** ఏపీ లిక్కర్ కేసులో మరో పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఏ4గా ఉన్న ఆయన్ను సిట్ అరెస్ట్ చేసింది. విజయవాడలోని సిట్ కార్యాలయంలో సుమారు 7 గంటలపాటు విచారించిన అనంతరం ఎంపీని అరెస్ట్ చేసింది. ఈ సమాచారాన్ని ఆయన బంధువులకు సిట్ అధికారులు తెలియజేశారు. లిక్కర్ పాలసీ రూపకల్పన, డొల్ల కంపెనీలకు ముడుపుల సరఫరా తదితర అంశాలపై మిథున్‌రెడ్డిని సిట్ ప్రశ్నించింది. ఎవరెవరితో ప్రైవేట్ సమావేశాలు నిర్వహించారనేదానిపై ఆరా తీసింది. డొల్ల కంపెనీల నుంచి సొమ్మును అంతిమ లబ్ధిదారుకి చేర్చిన విధానంపై సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

**రూ. 3,200 కోట్ల మద్యం కుంభకోణం..**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 3,200 కోట్ల మద్యం కుంభకోణం కేసు జరిగిందన్న ఆరోపణలపై ఏపీ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను కూడా సిట్



అరెస్ట్ చేసింది. అయితే విచారణకు హాజరయ్యేందుకు వచ్చిన మిథున్ రెడ్డిని కూడా అదుపులోకి తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి సన్నిహితులైన వ్యక్తులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిథున్ రెడ్డి అరెస్ట్ అక్రమమని వైసీపీ సీనియర్ నేత మల్లాది విష్ణు ఆరోపించారు. ఇదంతా కూడా కక్షసాధింపు కుట్రలో భాగమని చెప్పారు.

# ఏ ఒక్క రైతు ఇబ్బంది పడొద్దు!

- వానాకాలం పంటలకు సమృద్ధిగా నీరివ్వాలి
- నీటి విడుదలపై రూట్ మ్యాప్ రూపొందించి అమలు చేయండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- ఖరీఫ్ పంటకు నీటి విడుదల వంటి అంశాలపై మంత్రి రివ్యూ




**హైదరాబాద్, మహా:** వానాకాలం పంటలకు సమృద్ధిగా నీరు అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదట అటు వానాకాలం ఇటు యాసంగి పంటలకు ప్రణాళికాబద్ధంగా నీటిని అందించినందుకు అద్భుతమైన ఫలితాలు సాధించామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయం చేసుకున్నందునే.. రాష్ట్రం 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించి, యావత్ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఖరీఫ్ పంటకు నీటి విడుదలతో పాటు ఆధునిక పరిజ్ఞానంతో ఎస్ఎల్బీసీ పునరుద్ధరణ, నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా..**

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. వానాకాలం పంటలకు నీటి విడుదలపై రూట్ మ్యాప్ రూపొందించుకుని తక్షణమే అమలులో పెట్టాలన్నారు. సాగునీటి అంశంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. నీటి విడుదల విషయమై నీటిపారుదల శాఖ మొత్తం దృష్టి కేంద్రీకరించి, చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలన్నారు. ఈ వర్షాకాలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు సంభవిస్తే ఎదురయ్యే పరిణామాల పట్ల ముందస్తు బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రధాన ఆనకట్టలతో పాటు జలాశయాలు, కాలువలను అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా అధికారులు సన్నద్ధం కావాలని ఆయన ఆదేశించారు. నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్య దాస్ నాథ్, నీటిపారుదల శాఖ సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఈఎన్సీలు అంజాద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది నుంచే కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి

## ఇది దేశంలోనే పెద్ద రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

- వందేభారత్ బోగీలు కూడా ఇక్కడే తయారవుతాయి
- కాజీపేట నుంచి త్వరలోనే 150 లోకోమోటివ్‌లు కూడా ఎగుమతి: అశ్వినీ వైష్ణవ్
- 40 ఏళ్ల ఓరుగల్లు వాసుల కలను సాకారం చేశాం: కిషన్ రెడ్డి
- రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పరిశీలించిన కేంద్ర మంత్రులు



**హనుమకొండ, మహా:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలో 750 కోట్ల రూపాయలతో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. పనుల పరిశీలన నిమిత్తం శనివారం కేంద్రమంత్రి యూనిట్ ను సందర్శించారు. తెలంగాణలో ఇదో పెద్ద ప్రాజెక్టు అని చెప్పిన కేంద్రమంత్రి.. ఈ ప్రాజెక్ట్ వల్ల చాలా మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. దేశంలోనే ఇది.. పెద్ద రైల్వే మానుఫ్యాక్చరింగ్ యూనిట్ అని.. వందేభారత్ బోగీలు కూడా ఇక్కడే తయారవుతాయని మంత్రి వెల్లడించారు.

**త్వరలోనే 150 లోకోమోటివ్‌లు కూడా..**

ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతీయ రైల్వేలు పురోగమిస్తున్నాయని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రులకు వివరించారు. కాజీపేటలో మెగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం నిర్మిస్తోందని.. పనులు వేగంగా సాగుతున్నాయని అన్నారు. 2026 నాటికి కాజీపేటలో రైల్వే కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభం అవుతుందని.. కాజీపేట నుంచి త్వరలోనే 150 లోకోమోటివ్‌లు కూడా ఎగుమతి అవుతాయని కేంద్రమంత్రి చెప్పారు. త్వరలోనే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో మెట్రో కోచ్‌లు కూడా తయావుతాయని రైల్వే మంత్రి చెప్పారు.

**3వేల మందికి నేరుగా ఉపాధి..**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. '40 ఏళ్ల ఓరుగల్లు వాసుల కలను సాకారం చేశాం. వ్యాగన్ తయారీ, కోచ్‌ల తయారీ, ఓవర్ హాలింగ్ కోసం మూడు యూనిట్లు మంజూరు చేశాం. దీని ద్వారా 3వేల మందికి నేరుగా ఉపాధి కలుగుతుంది. ఓరుగల్లు అభివృద్ధి కోసం కేంద్రం ఎన్నో నిధులు కేటాయించింది. మోడీ గ్యారంటీ అంటే తప్పకుండా నెరవేరుతుంది" అని అన్నారు. "వేయి స్థంభాల మంటపం, రింగ్ రోడ్ నిర్మాణం పూర్తి చేశాం. త్వరలో వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ కూడా వస్తుంది. మోడీ వరంగల్‌కు ఏం ఇచ్చారో వరంగల్‌కి వచ్చి చూసి మాట్లాడాలి. వరంగల్ అభివృద్ధి, తెలంగాణ అభివృద్ధి పట్ల బీజేపీ ఎల్లప్పుడూ కమిట్మెంట్‌తో ఉంది" అని స్పష్టం చేశారు.




# పార్లమెంటులో అమీతుమీ

## ఇండియా కూటమి వర్చువల్ మీట్

**ఢిల్లీ, మహా :** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అధికార పక్షంతో అమీతుమీకి ఇండియా కూటమి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సమావేశాల్లో చర్చించాల్సిన కీలక అంశాలు, అనుసరించాల్సిన వ్యూహంపై విపక్ష ఇండియా కూటమి నేతలు శనివారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. 24 పార్టీలకు చెందిన నేతలు హాజరయినట్టు కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపీ జైరామ్ రమేష్ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియాగాంధీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య తదితరులు ఈ వర్చువల్ మీట్‌లో పాల్గొన్నారు. బీహార్‌లో ఎన్నికల కమిషనర్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టడం, ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ వంటి అంశాలు సమావేశం ఎజెండాలో కీలకంగా ఉన్నాయి. భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు తాను మధ్యవర్తిత్వం చేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకోవడం, తన నివాసంలో కాలిన నోట్ల కట్టలు కనిపించడంతో వివాదంలో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండటంపై వీటిపై ఉభయసభల్లో అనుసరించాల్సిన వైఖరిని సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది. కాగా ఈ సమావేశానికి ఆప్ హాజరుకాలేదు. తమ పొత్తు లోక్‌సభ ఎన్నికల వరకేనని స్పష్టం చేసింది.

# పారదర్శకంగా హౌసింగ్ బోర్డు స్థలాలు, ఇళ్ళ విక్రయాలు

## క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, మహా :** ఓఆర్ఆర్ లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమలన్నింటిని ఔటర్ రింగ్ రోడ్డుకు వెలుపల తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణ సమావేశంలో మంత్రులు, కమిటీ సభ్యులైన ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. పరిశ్రమల తరలింపునకు సంబంధించి విధి విధానాలు, తరలింపు కేలండర్ను రూపొందించాలని, తరలింపు ప్రక్రియకు తుది గడువును ఖరారు చేయాలని సబ్ కమిటీ సభ్యులు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఉన్న రాజీవ్ స్వగృహ పథకం కింద వివిధ దశల్లో ఉన్న ఇల్లు, హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఉన్న ఖాళీ స్థలాల విక్రయాలకు సంబంధించి సమావేశంలో సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో కొనసాగే బహిరంగ వేలం ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సబ్ కమిటీ సభ్యులు సూచించారు. సామాన్యులు, మధ్య తరగతి వర్గాలకు ఇల్లు అందుబాటులో ఉండేలా హౌసింగ్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. గత నెల రోజుల వ్యవధిలో వివిధ శాఖల ఆదాయాల పెరుగుదలపై ఆయా శాఖలో ఉన్న అధికారులు సమావేశంలో నివేదిక సమర్పించారు. కమర్షియల్ టాక్స్ శాఖలో 1.8 శాతం, స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖలో 3.6 శాతం, గనుల శాఖలో 7 శాతం ఆదాయం పెరుగుదల ఉన్నట్టు అధికారులు మంత్రులకు నివేదించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రదీప్ కుమార్ సుల్తానియా, పరిశ్రమల శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, మెట్రోపాలిటన్ ఏరియా నగర అభివృద్ధి శాఖ సెక్రటరీ, ఇలంబర్తి, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్, గనుల శాఖ కమిషనర్ శశాంక, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, టీజీటీడీసీ ఎండీ వల్లూరు క్రాంతి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# టాలీవుడ్‌లో రివ్యూ మాఫియా

(మొదటిపేజీ తరువాయి)

కలిగించేలా నెగెటివ్ రివ్యూలు ఇచ్చాడన్నది ప్రొడ్యూసర్ వెర్షన్. పూలచొక్కా రివ్యూలు తన సినిమాపై ప్రభావం చూపిందని, ఇది తమ మధ్య ఒప్పందానికి పూర్తి విరుద్ధమంటూ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు నిర్మాత రాజా దరపునేని . దీంతో ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి, నవీన్‌ను విచారణకు పిలిచారు. నెగిటివ్ రివ్యూల కారణంగా.. మొదటి రోజు రెండో ఆట నుండే కలెక్షన్లలో సడన్ డ్రాప్ అవుతున్నదని, కనీసం మూడురోజుల వరకు ప్రేక్షకుడికి.. మౌత్ టాక్ కు వదిలేస్తే సినిమా బతుకుందని తరచూ నిర్మాతలు, సినీ ప్రముఖులు మొత్తుకుంటుండగా, వీటికి తోడు రివ్యూ మాఫియా మరో ముప్పుగా మారింది. సినిమా విడుదలకు ముందు,.తర్వాత పాజిటివ్ రివ్యూలు ఇవ్వడానికి కొందరు యూట్యూబర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న టాక్ సినీ ఇండస్ట్రీలో ఉంది.

# లాల్‌దర్వాజ సింహవాహినీ అమ్మవారి బోనాలకు సర్వం సిద్ధం

**మహా:** 117 ఏళ్ల చరిత్ర కలిగిన లాల్‌దర్వాజ సింహవాహినీ అమ్మవారి బోనాల సమర్పణకు సర్వం సిద్ధమైంది. ఆ తల్లికి బోనం సమర్పిస్తే తమను కంటికి రెప్పలా కాపాడుతుందని భక్తులు విశ్వసిస్తారు. నిజాం కాలంలో ప్రారంభమైన అమ్మవారి బోనాలు నేటికీ వైభవంగా నిర్వహిస్తున్నారు.

# ఏపీలో మరో లులు మాల్

## 5 ఎకరాల స్థలం కేటాయించనున్న ప్రభుత్వం!

- విజయవాడకి రానున్న లులు మాల్
- ఆర్టీసీ డిపో స్థలాన్ని కేటాయించనున్న ప్రభుత్వం
- ఆర్టీసీకి ప్రత్యామ్నాయ భూమి




అమరావతి మహా : విజయవాడలో లులు మాల్ ఏర్పాటు కానుంది. పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు సమీపంలోని పోలీస్ కంట్రోల్ రూమ్ జంక్షన్ వద్ద ఉన్న గవర్నర్‌పేట 2 ఆర్టీసీ డిపో స్థలాన్ని ప్రభుత్వం లులు గ్రూప్‌ను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. లులు గ్రూప్ సంస్థ విశాఖపట్నం, విజయవాడల్లో మాల్స్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ రెండు చోట్లా కలిపి 1,222 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడంతోపాటు 1,500 మందికి ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేసింది. దీంతో విజయవాడలో లులు సంస్థ మాల్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమి కేటాయింపుపై ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (APIIC) పరిశీలన చేసింది. చివరకు గవర్నర్‌పేట 2 ఆర్టీసీ డిపో ఉన్న స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా డిపో స్థలాన్ని తమకు ఇవ్వాలంటూ ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఇటీవల లేఖ రాశారు.

# గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

## కేఎన్ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జున రెడ్డి

**మిర్యాలగూడ, మహా:** పట్టణంలోని కేఎన్ఎం డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మల్గిరెడ్డి భీమార్జున రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. తెలుగు, కామర్స్, రసాయన శాస్త్రం, జంతుశాస్త్రం, కంప్యూటర్ సైన్స్‌ల్లో ఒక్కో పోస్టుకు జనరల్ కేటగిరీ 55 శాతం మార్కులు, ఎస్సి, ఎస్టీ అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తులను స్వయంగా ఈ నెల 24 సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో అందజేయాలని ఆయన తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు.

# నువ్వా మాకు చెప్పేది

## రాజగోపాల్ రెడ్డికి అన్న మాటలతోనే కౌంటర్



**హైదరాబాద్, మహా:** రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన సోదరుడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గతంలో మాట్లాడిన మాటలతోనే కాంగ్రెస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా కౌంటర్ ఇస్తున్నాయి. గతంలో వెంకట్ రెడ్డి సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఈ ఐదేళ్లే కాదు మరో ఐదేళ్లు కూడా సీఎంగా ఉంటారని చెప్పారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన క్లిప్స్ ను కాంగ్రెస్ అభిమానులు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ 'ఒక్కసారి మీ అన్న మాటలు విను. పార్టీ మారిన నువ్వే చెప్పాలి మాకు సూక్తులు. ఈ వేషాలు వేస్తున్నందుకే నీకు మంత్రి పదవి దక్కలేదు' అని కౌంటర్లు ఇస్తున్నారు. ' పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు బీజేపీకి అమ్ముడు పోయి ఇప్పుడు హోం మంత్రి అవుతానని చెప్పుకోవడం కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకం కాదా? ఏదైనా ఉంటే అతంర్గతంగా మాట్లాడుకోవాలి,. ఇలా బహిరంగంగా పెట్టడం పార్టీ విధానమా?' అని నిలదీస్తున్నారు. మరో వైపు రాజగోపాల్ రెడ్డి అభిమానులు సైతం అంతే స్థాయిలో కౌంటర్లు ఇస్తున్నారు.

# ముద్రగడకు సీరియస్

## హైదరాబాద్ కు తరలింపు

**హైదరాబాద్, మహా:** కాపు ఉద్యమ నేత, వైసీపీ సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభరెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు అయినను మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తరలిస్తున్నారు. గత కొంత కాలంగా ముద్రగడ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఆయనకు షుగర్ లెవెల్స్ పడిపోవడంతో అస్వస్థతకు గురైనట్లు సమాచారం.

# కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

## సీఐటీయూ రాష్ట్ర నేత మల్లేశ్ డిమాండ్



**మిర్యాలగూడ , మహా:** మున్సిపల్ శాఖలో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులచే అధికారులు వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, రోజుకి 10 గంటల పని విధానాన్ని అమలు చేసి శ్రమదోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అందడం లేదని వాపోయారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందడం లేదని, కనీసం దహన ఖర్చులు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు.

# మేడారం మాస్టర్ ప్లాన్ సిద్ధం

- వారం రోజుల్లో గద్దెల చుట్టూ పనులకు ప్లాన్లు
- తల్లుల ధీరత్వాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతాం
- మహిళా శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- సమ్మక్క, సారలమ్మ ఆలయ ఆధునీకరణ పనులపై రివ్యూ



**హైదరాబాద్, మహా:** పూజారుల ఆలోచనలు కనుగుణంగానే మేడారం మాస్టర్ ప్లాన్ ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు. ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క, సారలమ్మ ఆలయ ఆధునీకరణ పనులపై హైదరాబాద్‌లోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. పూజారుల కోరిక మేరకు, భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ఆధునీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే ఆదివాసీ గిరిజన సంస్కృతి, సమ్మక్క సారలమ్మల తెగువ ఉట్టిపడేలా ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని నిర్ణయించింది. అమ్మల గద్దెల్లో ఎలాంటి మార్పులు చేయకుండా ఆలయ పరిసరాల్లో ఆధునీకరణ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసిల సంప్రదాయాలను, పూజారుల ఆలోచనలకు అనుగుణంగా మేడారం ఆధునికరణ పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారని, వారి ఆదేశానుసారం భక్తులకు సౌకర్యాలు కలిగించే విధంగా ఆలయ ప్రాంగణాన్ని ఆధునికరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

**వారి అభిప్రాయాలను తీసుకొని ముందుకు..**

ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలను చాటే విధంగా, సమ్మక్క సారలమ్మ తల్లుల ధీరత్వాన్ని ప్రతిబింబించే విధంగా ఆలయ ప్రాంగణాన్ని, పరిసరాలను తీర్చిదిద్దుతామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మల ప్రధాన గద్దెల్లో ఎలాంటి మార్పులు చేయకుండా పరిసరాలను భక్తుల ఆకాంక్షల మేరకు, పూజారుల ఆలోచనల మేరకు విశాలంగా తీర్చిదిద్దుతామన్నారు. పూజారుల ఆలోచనలు కనుగుణంగానే మేడారం మాస్టర్ ప్లాన్ ఉంటుందని, ఒక వారం రోజుల్లో గద్దెల చుట్టూ ఆధునీకరణ పనులకు సంబంధించి ప్లాన్‌ను సిద్ధం చేస్తామన్నారు. 'పూజారుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తాం. పనుల ప్రతి దశలో పూజారుల అభిప్రాయాలను తీసుకొని ముందుకెళ్లాలి. వచ్చే జాతరలోపు చేయాల్సిన పనులను ముందస్తుగా చేపడుతాం. భక్తులు పుణ్య స్నానాలు చేసే జంపన్న వాగు అభివృద్ధి కోసం ఐదు కోట్లు మంజూరు చేశాం. జంపన్న వాగు పనులను వేగవంతం చేయాలి. అత్యవసర సేవలు, భద్రత, వైద్య సిబ్బంది, పూజారులు, భక్తులకు, మీడియా ప్రతినిధులకు మరిన్ని వస్తువులు కల్పించే విధంగా గుడి చుట్టూ ఏర్పాట్లు చేస్తాం. మేడారంలో బస చేసే భక్తులకు ఎలాంటి లోటు రాకుండా అన్ని ఏర్పాటు చేస్తాం. కుంభమేళాలో భక్తులకు వసతులు కల్పించిన ఏజెన్సీలను సంప్రదించి వారి సలహాలు తీసుకుంటాం' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.



# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం మాదే

## టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలువురు నేతలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన మురళీ గౌడ్, సంజయ్ గౌడ్ తదితరులకు టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# మెట్రో రైలు విస్తరణపై ఎంపీలకు అవగాహన

- రెండోదశకోసం రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని రిక్వెస్ట్
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణకు సంబంధించి ఎంపీలకు అవగాహన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీకి చెందిన ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి చామల కిరణ్ కుమార్ రెడ్డి, జీ.వంశీ కృష్ణ, పి.బలరాం నాయక్, కుందూరు రఘువీర్, డాక్టర్ మల్లు రవి, ఆర్.రఘురామ్ రెడ్డి, సురేష్ కుమార్ షెట్కర్, ఎం.అనీల్ కుమార్ యాదవ్, బీజేపీ నుండి ఈటల రాజేందర్, ఎం.రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

రెండో దశ విస్తరణకు సంబంధించి కేంద్రం త్వరితగతిన అనుమతులు మంజూరు చేసేలా రాష్ట్రానికి చెందిన ఎంపీలు పార్టీలకు అతీతంగా కృషి చేయాలని మంత్రులు కోరారు. రెండో దశకు సంబంధించి అంశాలపై అవగాహన కల్పిస్తూ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టుకి సంబంధించి వివిధ సందేహాలను ఆయన నివృతి చేశారు.

# శ్రీ వాగ్దేవి పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ



**మిర్యాలగూడ, మహా:** బోనాల వేడుకలను మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంలో గల శ్రీ వాగ్దేవి పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సోమ గాని శ్రీను భవ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ బోనాలు అని, బోనాల పండుగను నిర్వహించడం ద్వారా ప్రజలు తమ కుటుంబాలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, మరియు శ్రేయస్సు కలగాలని కోరుకుంటారని, పిల్లలకు మన సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.


# రేవంత్ రెడ్డి ఒక లక్కీ భాస్కర్

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక రాజకీయ లక్కీ భాస్కర్ అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేసిన సభలో రాజకీయ విమర్శలా? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నిసార్లు మందలించినా రేవంత్ రెడ్డి తన భాషను మార్చుకోవడం లేదన్నారు. అందివచ్చిన అవకాశంలో రేవంత్ రెడ్డి ఓ రాజకీయ లక్కీ భాస్కర్ అని అన్నారు. వెళ్ళిన ప్రతి చోట పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని చెప్పుకుంటున్నాడన్నారు. కొల్లాపూర్‌లో నిర్వహించిన సభలో



40 నిమిషాల రేవంత్ రెడ్డి ప్రసంగంలో 38 సార్లు కేసీఆర్ నామస్మరణ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి పాలమూరుకు ఏం చేశాడు? అని ప్రశ్నించారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | ఆదివారం, తిరుపతి | 20-07-2025
ANN తెలుగు



# గాయపడిన షారుఖ్ ఖాన్.. అమెరికాకు ప్రయాణం!



బాలీవుడ్ ప్రముఖ నటుడు షారుఖ్ ఖాన్ గాయపడ్డారని తెలుస్తోంది. తను నటిస్తున్న కొత్త సినిమా 'కింగ్' షూటింగ్‌లో ఆయన ప్రమాదానికి గురైనట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ముంబైలోని గోల్డెన్ టొబాకో స్టూడియోలో కింగ్ సినిమా షూటింగ్ జరుగుతుంది. అందులో కొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం అతిపెద్ద సెట్ వేశారు. యాక్షన్ సీన్ చిత్రీకరణలో భాగంగానే షారుఖ్ గాయపడ్డారని చెబుతున్నారు. అయితే, గాయం గురించి ఖచ్చితమైన వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. కానీ, షారుఖ్ తన టీమ్‌తో కలిసి అత్యవసర వైద్య సహాయం కోసం అమెరికాకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆయన కండరాలకు తీవ్రంగా గాయం అయినట్లు సమాచారం. అయతే, అభిమానులు పెద్దగా కంగారు పడాల్సిన అవసరం లేదని బాలీవుడ్ మీడియా పేర్కొంది. షారుఖ్ గతంలోనే కండరాల సమస్యతో ఇబ్బంది పడ్డారు. అందుకోసం చికిత్స కూడా తీసుకున్నారు. 2023లో పఠాన్, జవాన్, డంకీ చిత్రాలతో షారుఖ్ ఖాన్ హ్యాట్రిక్ విజయాలను సొంతం చేసుకున్నారు. 2024లో సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చారు. అయితే, 'కింగ్' సినిమా ప్రకటించి ఆయన మళ్లీ బిజీ అయ్యారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఈ చిత్రం రానుంది. గతంలో వారిద్దరూ పఠాన్‌తో భారీ విజయాన్ని అందుకున్నారు. ఇందులో షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నారు.దీపికా పదుకొణె, రాణి ముఖర్జీ, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు తెలుస్తోంది.

# రియల్ హీరో అంటే మీరే!

## 650 మంది స్టంట్ వర్కర్స్‌కి బీమా చేయించిన అక్షయ్ కుమార్

వెండితెరపై మంచి పనులు చేసి, హీరో అనిపించుకుంటారు స్టార్స్. అది 'రీల్ హీరో'. అదే తెర వెనుక మంచి పనులు చేస్తే 'రియల్ హీరో' అనిపించుకుంటారు. ఇప్పుడు అక్షయ్ కుమార్‌ని అందరూ 'రియల్ హీరో అంటే మీరే' అంటున్నారు. మరి... 650 మంది స్టంట్‌మెన్, ఉమెన్‌కి బీమా చేయిస్తే ఆ మాత్రం అభినందించాల్సిందే కదా. ఇటీవల తమిళ చిత్రం 'వేట్టువం' షూటింగ్‌లో స్టంట్ మేన్ రాజు గుండెపోటుతో మరణించారు. ఆర్య హీరోగా పా. రంజిత్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. కారుతో స్టంట్స్ చేస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది.

మామూలుగా ఫైట్ సీన్స్ చిత్రీకరించేటప్పుడు కూడా ప్రమాదాలకు గురై, స్టంట్ వర్కర్స్ మరణిస్తుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే అక్షయ్ కుమార్ తాజాగా 650 మంది స్టంట్ మెన్, ఉమెన్‌కి బీమా చేయించారు. ఈ విషయం గురించి బాలీవుడ్ స్టంట్ మాస్టర్ విక్రమ్ సింగ్ స్పందిస్తూ – "మీరు (అక్షయ్‌ని ఉద్దేశించి) చేసిన ఈ మంచి పని వల్ల బాలీవుడ్‌లో 650 మంది స్టంట్ వర్కర్స్ బీమా పరిధిలోకి వచ్చారు.

ఈ ఇన్సూరెన్స్ పాలసీలో రూ. 5 లక్షల నుంచి 5.50 లక్షల వరకూ నగదురహిత చికిత్స పొందే వెసులుబాటు ఉంది. అది షూటింగ్ సెట్‌లో అయినా విడిగా అయినా. మీకెలా ధన్యవాదాలో చెప్పాలో తెలియడంలేదు అక్షయ్ సార్" అని పేర్కొన్నారు.



# ఒక్కోసారి నేను కూడా అప్‌సెట్ అవుతాను: కీర్తి సురేష్

ఇంతకు ముందు తమిళం, తెలుగు, మలయాళం భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్న నటి కీర్తిసురేశ్. కాగా ఎప్పుడైతే హిందీ చిత్రంలో నటించడానికి అంగీకరించిందో, అప్పటి నుంచి దక్షిణాదిలో నటించిన చిత్రాలు సక్సెస్‌కు దూరం అయ్యాయి. బాలీవుడ్‌లో నటించిన ఏకైక చిత్రం బేబిజాన్ పూర్తిగా నిరాశ పరచింది. అదే సమయంలో తన చిరకాల బాయ్‌ఫ్రెండ్‌ను పెళ్లి చేసుకుని, సంసార జీవితంలోకి ఎంట్రీ ఇచ్చింది. అలాగే సమీప కాలంలో కీర్తి సురేశ్ నటించిన ఉప్పు కారం చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలైంది. ఈ చిత్రం గురించి కీర్తి సురేశ్ చాలా ఎక్కువగానే ఊహించుకుంది. కానీ ఆ చిత్రం పెద్దగా ప్రేక్షకాదరణ పొందలేక పోయింది. ఆ తరువాత మరో కొత్త చిత్రంలో నటించలేదు.

కమర్శియల్ చిత్రాల్లో నటించి, హీరోయిన్ ఓరియన్‌టెడ్ కథా చిత్రాల్లో నటించి, జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకున్న నటికి ఇప్పుడు అవకాశాలు లేవంటే నమ్మశక్యం కాని పరిస్థితి. కొత్తగా అవకాశాలు రావడం లేదా? లేక ఈ బ్యూటీ అంగీకరించడం లేదా? అన్నది తెలియని పరిస్థితి. అయినా కీర్తిసురేశ్ వాణిజ్య ప్రకటనల్లో నటిస్తూ బిజీగానే ఉంది. కాగా ఇటీవల ఈ బ్యూటీ ఒక భేటీలో పేర్కొంటూ 'ఒక్కోసారి నేను అప్‌సెట్ అవుతుంటానని, అప్పుడు ఏం చేస్తానో తెలుసా. ఫుల్‌గా భోజనం చేస్తాను. అలాగే కారు తీసుకుని ఒంటరిగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లతాను. ఆ సమయంలో కారులో మంచి సంగీతం వింటాను. అలానే ఇంట్లో ఒక పెట్ కుక్కను పెంచుకుంటున్నాను. నేను అప్‌సెట్ అయితే దాని ముఖం చూస్తే వెంటనే అంతా మాయం అవుతుంది.' అని కీర్తి సురేశ్ పేర్కొంది. కాగా ఈ అమ్మడు ఇంతకు ముందు నటించిన హీరోయిన్ సెంట్రిక్ కథా చిత్రాలు రివాల్వర్ రిటా, కన్నివెడి విడుదల కావలసి ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కటి హిట్ అయినా కీర్తిసురేశ్‌కు మళ్లీ క్రేజ్ పెరిగే అవకాశం లేకపోలేదు. ఏదేమైనా ఈ అమ్మడు మాత్రం సామాజిక మాధ్యమాల్లో చాలా యాక్టివ్‌గా ఉంటుంది.





# ఓటీటీలో కోర్ట్ డ్రామా..

చట్టం, పోలీస్ వ్యవస్థ ఈ రెండూ శక్తివంతమైనవే. అయితే ఒక్కోసారి ఈ రెండూ డబ్బుకు అమ్ముడుపోతుంటాయి. అలాంటప్పుడు సామాన్యుడికి న్యాయం లభించడమనేది గగనంగా మారుతుంది. అయితే న్యాయం కోసం అలుపెరగకుండా పోరాడే న్యాయవాదులు ఉంటారు. న్యాయాన్ని గెలిపించేందుకు నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటారు. ఆ ప్రయత్నంలో ఒక్కోసారి ఓడిపోయినా.. డబ్బు ఎక్కువై విర్రవీగేవారితో, అవినీతిపరులైన డిపార్ట్‌మెంట్ అధికారులతో అలుపెరుగని పోరాటం చేస్తుంటారు.

**చట్టముమ్ నీతియుమ్**

అందులో అవమానాలు, అవరోధాలు ఎదురైనా వెనుకడుగు వేయరు. అలాంటి ఒక న్యాయవాది ఇతి వృత్తంతో రూపొందిన తమిళ వెబ్ సిరీస్ చట్టముమ్ నీతియుమ్. నటుడు పరుత్తివీరన్ శరవణన్ ప్రధాన పాత్ర పోషించిన ఇందులో నటి నమ్రిత, అరుళ్ డీ.శంకర్, షణ్ముగం, తిరుసెల్వమ్, విజయశ్రీ, ఇనియ రామ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. బాలాజీ సెల్వరాజ్ డైరెక్ట్ చేశాడు. 18 క్రియేటర్స్ పతాకంపై శశికళ ప్రభాకరన్ నిర్మించారు.

**న్యాయాన్ని గెలిపించలేక..**

డబ్బుకు లోకం దాసోహం అవుతున్న తరుణంలో సామాన్యులకు న్యాయం అనేది అందని ద్రాక్షలాగే మారిపోతుంది. అలాంటి పరిస్థితుల్లో ఒక అమాయకుడికి న్యాయస్థానంలో న్యాయాన్ని అందించలేకపోయిన ఒక నిజాయితీ పరుడైన న్యాయవాది అదే కోర్టు బయట నోటరీలు రాసుకుంటూ కాలం గడుపుకుంటాడు. దీంతో ఆయనకు ఇంటా బయట కనీస మర్యాద కూడా లేని పరిస్థితి.

**ఏ ఓటీటీలో అంటే?**

అలాంటి వ్యక్తి ఆవేశంతో, సమాజంపై కోపంతో.. తన కళ్ల ముందు జరిగిన దుర్ఘటనపై ప్రజావ్యాజ్యం వేస్తాడు. అప్పుడూ పరిహాసానికి గురవుతాడు. అతడు న్యాయం కోసం చేసే నిరంతర పోరాటమే చట్టముమ్ నీతియుమ్. పలు ఆసక్తికరమైన అంశాలతో సహజత్వానికి దగ్గరగా రూపొందించిన ఈ వెబ్ సిరీస్‌లో పరుత్తివీరన్ శరవణన్ న్యాయవాదిగా ప్రధానపాత్ర పోషించారు. ఈ వెబ్ సిరీస్ శుక్రవారం (జూలై 18) నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com